సాక్షి నిర్మల్

I

గురువారం : 2 : అక్టోబర్ : 2025



న్యూస్‌రీల్

ఘనంగా ఆయుధపూజ



ఆయుధపూజలో ఎస్పీ జానకీ షర్మిల, ఏఎస్పీలు

నిర్మల్‌టౌన్: దసరాను పురస్కరించుకుని జిల్లా సాయుధ కార్యాలయంలో బుధవారం ఎస్పీ జానకీ షర్మిల జమ్మి చెట్టు, పోలీస్ వాహనాలకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జిల్లా ప్రజలందరికీ విజయదశమి శుభాకాంక్షలు తెలిపారు. దుర్గామాత విగ్రహ నిమజ్జన కార్యక్రమాన్ని జిల్లా ప్రజలు శాంతియుతంగా జరుపుకోవాలని సూచించారు. అనంతరం సిబ్బందికి విజయదశమి బోనస్‌ను స్వయంగా అందజేశారు. కార్యక్రమంలో ఏఎస్పీలు అవినాష్ కుమార్, రాజేశ్ మీనా, సీఐలు ప్రవీణ్‌కుమార్, కృష్ణ, ఆర్‌ఐలు, ఎస్సైలు, సిబ్బంది పాల్గొన్నారు.

బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ర్యాలీ



ర్యాలీ తీస్తున్న బీఎస్ఎన్ఎల్ సిబ్బంది

నిర్మల్ టౌన్: బీఎస్ఎన్ఎల్ సిల్వర్ జూబ్లీని పురస్కరించుకుని జిల్లా కేంద్రంలో బుధవారం ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏరియా డీఈ శర్మన్ మాట్లాడుతూ.. బీఎస్ఎన్ఎల్ దేశవ్యాప్తంగా టెలికాం సేవల విస్తరణలో కీలక పాత్ర పోషిస్తోందని తెలిపారు. ప్రభుత్వ మద్దతుతో 04జీ సాచ్యురేషన్ ప్రాజెక్ట్ కింద ఇప్పటి వరకు నెట్‌వర్క్ చేయలేని ప్రాంతాలు, గ్రామాల్లోనూ అధునాతన 4జీ సేవలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు. బీఎస్ఎన్ఎల్ ఒక శక్తివంతమైన సంస్థగా ఎదిగిందని, ప్రైవేట్ కంపెనీలకు దీటుగా నిలుస్తోందని తెలిపారు. బీఎస్ఎన్ఎల్ సిబ్బంది ప్రవీణ్‌కుమార్, అవినాష్‌రెడ్డి, రాకేశ్ గౌడ్, సతీశ్‌కుమార్, శర్మ తదితరులున్నారు.

కంటి పరీక్షాకేంద్రం ప్రారంభం



కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సమతా సుదర్శన్

నర్సాపూర్(జి): మండల కేంద్రంలో సమతా సుదర్శన్ కంటి పరీక్ష కేంద్రాన్ని బుధవారం సమతా ఫౌండేషన్ చైర్మన్ సమతా సుదర్శన్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ.. మండల ప్రజలు కంటి పరీక్షాకేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. జాతీయస్థాయిలో సేవలందిస్తున్న ఎల్వీ ప్రసాద్ హాస్పిటల్ యాజమాన్యం సహకారానికి కృతజ్ఞతలు తెలిపారు. ఎల్వీ ప్రసాద్ ముధోల్ ఆస్పత్రి కంటి డాక్టర్లు, ఫౌండేషన్ సీఈవో అనిల్‌కుమార్, సభ్యులు సాయికృష్ణ, షేక్ సాజిద్, బర్కుంట ముత్యం తదితరులు పాల్గొన్నారు.

పుణ్యతిథి ఉత్సవాలు షురూ



సాయి నామస్మరణ చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూరు సాయిబాబా ఆలయంలో గురువారం సాయిబాబా పుణ్యతిథి కావడంతో బుధవారం సాయి నామస్మరణతో ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. బాబాకు అభిషేకం, అలంకరణ, హారతి తదితర పూజాది కార్యక్రమాలు చేపట్టారు. భక్తులకు తీర్థ ప్రసాదం పంపిణీ చేశారు.

నిమజ్జనానికి బందోబస్తు

నిర్మల్ టౌన్: జిల్లా కేంద్రంలో నిర్వహించనున్న దుర్గాదేవి నిమజ్జనానికి పటిష్ట బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఎస్పీ జానకీ షర్మిల బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. పోలీస్ శాఖ సూచనలకు అనుగుణంగా నిర్వాహకులు, ఉత్సవ కమిటీ సభ్యులు ప్రశాంతంగా నిమజ్జనం నిర్వహించాలని సూచించారు.

ఎఫ్‌బీవో రాజేందర్‌కు డాక్టరేట్



రాజేందర్‌ను అభినందిస్తున్న శరవణన్

నిర్మల్‌టౌన్: బాసర సర్కిల్, నిజామాబాద్ జిల్లా ఆర్మూర్ డివిజన్ సిరికొండ రేంజ్‌లో ఎఫ్‌బీవోగా విధులు నిర్వహిస్తున్న మాలవత్ రాజేందర్ ఉస్మానియా యూనివర్సిటీ నుంచి డాక్టరేట్ పట్టా పొందారు. ఈ సందర్భంగా బుధవారం జిల్లా కేంద్రంలోని ఫారెస్ట్ సర్కిల్ కార్యాలయంలో రాజేందర్‌ను బాసర సర్కిల్ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ అభినందించారు.

విజయానికి ప్రతీక

- నేడు దసరా పండుగ
- జిల్లాలో అన్ని ఏర్పాట్లు పూర్తి
- వేడుకలకు ఆలయాలు ముస్తాబు

నిర్మల్‌టౌన్: తెలుగు ప్రజలు జరుపుకొనే పండుగల్లో అతిపెద్దది దసరా. ముఖ్యంగా తెలంగాణ ప్రజలు ఈ పండుగను మహా సంబురంగా జరుపుకొంటారు. హిందూ సంస్కృతిలో దీనికి ఎంతో ప్రాముఖ్యత ఉంది. చెడుపై మంచి సాధించిన విజయానికి గుర్తుగా, మహిషాసురుడిపై దుర్గామాత విజయం, రావణుడిపై శ్రీరాముడు సాధించిన విజయానికి గుర్తుగా దసరా నిర్వహించుకుంటారు. ఈ రోజు ఆయుధ పూజ, పొలిమేర దాటడం, జమ్మి చెట్టు పూజ, పాలపిట్ట దర్శనం చేసుకునే ఆనవాయితీ అనాదిగా వస్తోంది. నేడు విజయదశమి దసరా సందర్భంగా ప్రత్యేక కథనం..

ఆయుధ పూజ: దసరా పండుగ రోజు నిర్వహించే ఆయుధ పూజ చాలా విశిష్టమైంది. ఉద్యోగులు, వ్యాపారాల్లో స్థిరపడ్డవారంతా ఈ పూజ చేస్తారు. తమ వృత్తికి సంబంధించిన సామగ్రి, ముఖ్యమైన పరికరాలను అమ్మవారి ఎదుట ఉంచి ఆయుధ పూజ నిర్వహిస్తారు.

పాలపిట్ట దర్శనం: దసరా వేడుకలు నిర్వహించిన అనంతరం పాలపిట్టను చూస్తారు. పాలపిట్టను చూడడానికి గల ప్రత్యేకత ఏమిటంటే పాండవులు అరణ్య, అజ్ఞాత వాసాలను ముగించుకుని రాజ్యానికి తిరిగి వస్తుండగా ఈ పాలపిట్ట కనబడిందని, అప్పటినుంచి వారికి విజయాలు కలిగాయని అందరూ నమ్ముతారు. అందుకే విజయదశమి రోజు తప్పనిసరిగా పాలపిట్ట చూడడం ఆనవాయితీగా వస్తోంది.

జమ్మి చెట్టు పూజ: పాండవులు అరణ్యవాసం ముగించుకుని అజ్ఞాత వాసానికి వెళ్తూ.. జమ్మి చెట్టు కొమ్మల మధ్య తమ ఆయుధాలు దాచి వెళ్లారని పురాణాలు చెబుతున్నాయి. వనవాసం నుంచి తిరిగి వచ్చిన తర్వాత అర్జునుడు జమ్మి చెట్టుపై దాచిన ఆయుధాలను తీసి పూజించి, ఉత్తర గోగ్రహణ యుద్ధం చేశాడని.. ఆ యుద్ధంలో శత్రువులను జయించి విజయం పొందాడని చెబుతారు. అందుకే ఆయుధాలకు రక్షణ కల్పించిన జమ్మి చెట్టును అప్పటినుంచి పవిత్రంగా భావించడం ఆనవాయితీగా వస్తోంది.

మహాలక్ష్మి ఆలయం వద్ద ఏర్పాట్లు

జిల్లా కేంద్రంలోని బంగాల్‌పేట్ మహాలక్ష్మి, నందిగుండం దుర్గామాత అమ్మవారి ఆలయాల ప్రాంగణాల్లో దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. మహాలక్ష్మి అమ్మవారి ఆలయ ప్రాంగణంలోని సుమారు రెండెకరాల ఖాళీ స్థలంలో రావణ వధ దహన కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. స్థలం చదును చేయించారు. ఉత్సవాల నిర్వహణకు మున్సిపల్ ఆధ్వర్యంలో వేదిక, లైటింగ్, టెంట్లు, బారికేడ్లు, తాగునీటి సదుపాయం కల్పించారు. విశ్వహిందూ పరిషత్, బంగల్‌పేట్ ఆంజనేయ యూత్ ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణమంతా మామిడి తోరణాలతో అలంకరించారు. రావణుని బొమ్మ దహన కార్యక్రమం, సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించనున్నారు. ఈ వేడుకలను తిలకించేందుకు ప్రజలు అధికసంఖ్యలో హాజరవుతారు. మహాలక్ష్మి ఆలయం సమీపంలోని దసరా ఏర్పాట్లను స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ ఆలయంతో పాటు నందిగుండం దుర్గామాత ఆలయం వద్ద దసరాను పురస్కరించుకుని ప్రత్యేక వేడుకలు నిర్వహిస్తారు.



విద్యుద్దీపాల కాంతిలో వెలిగిపోతున్న మహాలక్ష్మి ఆలయం

ప్రత్యేక కార్యక్రమాలు

దసరా వేడుకలు గురువారం సాయంత్రం 5గంటలకు మహాలక్ష్మి అమ్మవారి ఆలయం వద్ద ప్రారంభమవుతాయి. ఈ కార్యక్రమాన్ని స్థానిక ఎమ్మెల్యే ఏలేటి మహేశ్వర్‌రెడ్డి ప్రారంభిస్తారు. కలెక్టర్ అభిలాష అభినవ్ శమీపూజ చేస్తారు. ఆయుధ పూజను ఎస్పీ జానకీ షర్మిల నిర్వహిస్తారు. అనంతరం ఎమ్మెల్యే రావణుని బొమ్మను దహనం చేస్తారు. సభాధ్యక్షుడిగా ముప్పిడి రవి వ్యవహరిస్తారు. భరత మాత పూజను విశ్వహిందూ పరిషత్ ఇందూరు విభాగ్ ధర్మచర్య సంపర్క్ ప్రముఖ్ పతికే రాజేందర్ నిర్వహిస్తారు. దీనికి ముందు వీరంతా మహాలక్ష్మి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు చేస్తారు.

అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం



దసరా పండగను పురస్కరించుకుని బంగాల్‌పేట్ మహాలక్ష్మి అమ్మవారి ఆలయనికి వచ్చే భక్తులకు మున్సిపల్ ఆధ్వర్యంలో అన్ని రకాల వసతులు కల్పించాం. భక్తులకు ఎలాంటి ఇబ్బంది రాకుండా ఆలయం పక్కన గల గ్రౌండ్ చదును చేశాం. వాటర్, కరెంట్ సౌకర్యం కల్పించాం. టెంట్లు, బారికేడ్లు, వేదిక సిద్ధం చేశాం.

– జగదీశ్వర్ గౌడ్, మున్సిపల్ కమిషనర్

విజయవంతం చేయాలి



బంగాల్‌పేట్ మహాలక్ష్మి ఆలయం నిర్మల్‌లోనే ప్రసిద్ధి గాంచింది. ఏటా ఇక్కడ దసరా ఉత్సవాలను వైభవంగా నిర్వహిస్తాం. ఆలయాన్ని శోభాయామానంగా ముస్తాబు చేశాం. భక్తులకు వసతులు కల్పించాం. భక్తులు అధికసంఖ్యలో హాజరై వేడుకలను విజయవంతం చేయాలి.

– ముప్పిడి రవి, వీహెచ్‌పీ జిల్లా ఉపాధ్యక్షుడు



ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఎమ్మెల్యే మహేశ్వర్‌రెడ్డి



రావణుని బొమ్మ తయారు చేస్తున్న కళాకారులు



మహాలక్ష్మి ఆలయంలో ఏర్పాటు చేసిన బారికేడ్లు

దావత్ ఉందా..?

- ఆశావహులకు దసరా పరేషాన్
- పెరుగుతున్న అనుచరుల ఒత్తిడి
- 8న హైకోర్టు ఏం చెబుతుందో..!
- అయోమయంలో పోటీదారులు



నిర్మల్: 'ఏమే.. నర్సన్న ఎట్లన్న రిజర్వేషన్ నీదిక్కే అచ్చే. ఇంకేమున్నదే గెల్సుడు కూడా నువ్వే గెలుస్తవ్. సప్పుడుదాకా దసరా పండుక్కు మనోళ్లందరికీ దావతిచ్చెయ్యే..' అని దగ్గరోళ్లు అడుగుతుంటే ఆశావహులు మాత్రం ఎటూ చెప్పలేకపోతున్నారు. ఇప్పటికే రిజర్వేషన్లు ఖరారైనా, ఎన్నికల కోడ్ అమలులోకి వచ్చినా.. ఇంకా డైలామాలోనే ఉన్నారు. ఈనెల 8న హైకోర్టు ఇచ్చే తీర్పు ఎట్లుంటదో, ఈ ఎన్నికలు కొనసాగుతాయా.. లేక వాయిదా వేస్తారా..? అన్న కోణంలో ఆశావహులు ఆలోచిస్తున్నారు. రిజర్వేషన్ కలిసొచ్చినా.. పార్టీ తననే నిలబెడుతుందా.. లేక ఇంకొకరికి సీటిస్తుందా..? అన్న సందేహంతో ఉన్నవాళ్లు పండుగ దావత్‌లకు ఇంకా పచ్చజెండా ఊపడం లేదు. 'సర్పంచో, ఎంపీటీసో.. ఏదైతేమున్నది..! ముందైతే అందరినీ తన వైపు తిప్పుకుందాం..' అనుకునే ఆశావహులు మాత్రమే దసరా దావత్‌ల ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

8న ఏం తేలుతుందో!

రాష్ట్ర ఎన్నికల సంఘం స్థానిక సంస్థల ఎన్నికల రిజర్వేషన్లు ఖరారు చేసింది. షెడ్యూల్ కూడా ప్రకటించింది. ఎన్నికల నోటిఫికేషన్‌ను మాత్రం ఈనెల 9న ఇవ్వనున్నట్లు పేర్కొంది. ఇందుకు బీసీలకు 42శాతం రిజర్వేషన్ల అంశం హైకోర్టులో పెండింగ్‌లో ఉండటం, దీనిపై ఈనెల 8న తీర్పు వెలువడనుండమే కారణం. తీర్పు ఎలా ఉంటుందో.. ఏం వస్తుందో.. తెలియదు. బీసీ రిజర్వేషన్లకు తామంతా మద్దతిస్తున్నామని చెబుతున్న ప్రతిపక్షాలు రాజ్యాంగ విరుద్ధంగా రిజర్వేషన్ల ప్రక్రియ తేలకుండా ఎలా ఎన్నికలకు వెళ్తారు? లాంటి ప్రశ్నలూ వేస్తున్నాయి. ఇవి కూడా ఆశావహులను గందరగోళంలో పెడుతున్నాయి.

అడగడమా.. ఆగడమా..!?

హైకోర్టు తీర్పు వచ్చే దాకా ఆగడమా.. లేక ఇప్పటి నుంచే తమ అభ్యర్థిత్వాన్ని ఖరారు చేయాలంటూ పార్టీలను అడగడమా.. అనే అంశాన్నీ ఆశావహులు తేల్చుకోలేకపోతున్నారు. రిజర్వేషన్ అనుకూలంగా వచ్చినచోట ఇప్పటికే ఈసారి తమకే చాన్స్ అంటూ చాలామంది ప్రచారం చేసుకుంటున్నారు. తమ బలగం పెంచుకునేందుకు, అన్నివర్గాల మద్దతు దక్కించుకునేందుకు ప్రయత్నాలూ మొదలుపెట్టారు. ఇందులో భాగంగానే దసరాకు చాలాచోట్ల దావత్‌లకూ ప్లాన్ చేసి పెట్టుకున్నారు. కానీ.. ఎక్కడో ఒక చోట కోర్టు తీర్పు ఎలా వస్తుందో.. ఇదే రిజర్వేషన్ ఉంటుందో, ఉండదో.. లేక ఎన్నికలే వాయిదా పడతాయేమో.. అన్న అనుమానాలు ఆశావహులను ఇబ్బంది పెడుతున్నాయి.

దావతైతే ఇచ్చేద్దాం

జెడ్పీటీసీ, సర్పంచ్, ఎంపీటీసీ స్థానాల కోసం పోటీ పడాలనుకునే ఆశావహులకు రిజర్వేషన్ల ఖరారు నుంచే తమ మద్దతుదారుల ఒత్తిడి పెరుగుతోంది. 'అన్నా.. ఈసారి పండుగకు ఊళ్లె మనమే చూసుకోవాల్నె..' అంటూ వెంటపడుతున్న దాఖలాలు కనిపిస్తున్నాయి. ఇలాంటి సందర్భాల్లో 'పోయి పోయి.. ఈ ప్రకటన దసరా పండుగప్పుడే అచ్చే.. ఇగ ఊళ్లె ఆగుతరా..! పెద్దరికానికన్నా దావతియ్యవడతది..' అంటూ చాలామంది నేతలు, నాయకులు, ఆశావహులు దసరాకు సిద్ధమవుతున్నారు.

ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలి

నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికలు సమర్థవంతంగా నిర్వహించాలని జెడ్పీ సీఈవో గోవింద్ సూచించారు. జిల్లాలో జెడ్పీటీసీ, ఎంపీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికల నిర్వహణపై అధికారులకు కలెక్టరేట్ సమావేశ మందిరంలో బుధవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎన్నికల నిర్వహణలో పారదర్శకత, నిష్పక్షపాత ధోరణి అత్యంత ముఖ్యమని పేర్కొన్నారు. ఎన్నికల ప్రక్రియలో ఆర్వోలు, ఎఫ్ఎస్టీ, ఎస్ఎస్టీ బృందాల విధులు, బాధ్యతల గురించి అవగాహన కల్పించారు. పోలింగ్ కేంద్రాల ఏర్పాటు, నిబంధనలు, ఎన్నికల సామగ్రి వినియోగం తదితర అంశాల గురించి వివరించారు. డీపీవో శ్రీనివాస్, డీఈవో భోజన్న తదితరులు పాల్గొన్నారు.



శిక్షణ కార్యక్రమంలో పాల్గొన్న అధికారులు

భైంసాలో రావణ దహనం ప్రత్యేకం

భైంసాటౌన్: దసరా రోజు సాయంత్రం భైంసాలో పట్టణంలో రావణ దహనం కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహిస్తారు. పట్టణంలోని కిసాన్‌గల్లిలోగల బాగుబాయి గుట్టపై సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు బాబన్న, ప్రవీణ్, శంకర్, విశాల్, ప్రకాశ్ ఆధ్వర్యంలో ఏటా దసరా వేడుకలు ఘనంగా నిర్వహిస్తారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో దాదాపు రూ.లక్షకుపైగా వెచ్చించి గుట్టపై రావణ ప్రతిమను ఏర్పాటు చేసి పట్టణ ప్రముఖులు, ప్రజాప్రతినిధులు, అధికారులను ఆహ్వానించి కార్యక్రమం ప్రారంభిస్తారు. భారీ టపాసుల పేలుళ్లతో జరిగే రావణ దహనం కార్యక్రమాన్ని వీక్షించేందుకు పట్టణ ప్రజలు భారీసంఖ్యలో తరలివస్తారు. ఈ దృశ్యాలను సెల్‌ఫోన్లలో చిత్రీకరించి సంతోషంగా గడుపుతారు.



బాగుబాయి గుట్టపై ఏర్పాటు చేసిన ప్రతిమ (ఫైల్)

వన్యప్రాణుల సంరక్షణ.. అందరి బాధ్యత

సారంగాపూర్: వన్యప్రాణుల సంరక్షణ.. అందరి బాధ్యత అని అటవీశాఖ చీఫ్ కన్జర్వేటర్ శరవణన్ సూచించారు. మండలంలోని చించోలి(బీ) గ్రామ సమీపంలోగల గండిరామన్న హరితవనంలో బుధవారం వన్యప్రాణి సప్తాహ కార్యక్రమాన్ని నిర్వహించారు. పాఠశాల విద్యార్థులకు వన్యప్రాణుల సంరక్షణపై అవగాహన కల్పించారు. అనంతరం హరితవనంలో విద్యార్థులు, సిబ్బందితో కలిసి మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అడవి జంతువులవల్లనే అటవీ రక్షణ సాధ్యపడుతుందని తెలిపారు. కొందరు స్వార్థ ప్రయోజనాల కోసం అడవి జంతువులను వేటాడి తినడంతో జీవవైవిధ్యంలో మార్పులు చోటు చేసుకుంటున్నాయని పేర్కొన్నారు. ఈ కారణంగా వన్యప్రాణులు ఆహారం కోసం గ్రామాల్లోకి చొరబడే పరిస్థితులు నెలకొన్నాయని తెలిపారు. ఖాళీ స్థలాల్లో మొక్కలు నాటి సంరక్షిస్తే ప్రకృతి విపత్తులనుంచి బయటపడే అవకాశముందని, మానవ మనుగడకు నష్టం జరగదని పేర్కొన్నారు. ఎఫ్‌డీవో నాగిణీభాను, ఎఫ్ఆర్వోలు రామకృష్ణ, వేణుగోపాల్, శ్రీనివాసరావు, రమేశ్ రాథోడ్, డీఆర్వోలు నజీర్‌ఖాన్, సంతోష్, రాజేశ్వర్, ఇర్ఫాన్, అటవీశాఖ సిబ్బంది ఉన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న శరవణన్

అమ్మవారికి మొక్కులు



అమ్మవారికి ముక్కుపుడక, బొట్టు బిల్ల అలంకరిస్తున్న శ్రీనివాస్ కుటుంబీకులు

నిర్మల్‌చైన్‌గేట్: దసరా ఉత్సవాల్లో భాగంగా పట్టణంలోని మహాలక్ష్మి అమ్మవారికి బేస్తవారిపేటకు చెందిన శ్రీమతి దొండి సురేఖ శ్రీనివాస్ కుటుంబ సభ్యులు బుధవారం బంగారు, వెండి ముక్కుపుడకలు, బొట్టు బిల్లలు, పట్టు పితారంబరం, గజ మూలం సమర్పించి మొక్కు తీర్చుకున్నారు. ఆలయ కమిటీ సభ్యులు దొండి శ్రీనివాస్ సురేఖ దంపతులను సన్మానించి ఆశీర్వదించారు.

అధిక చార్జీలు వసూలు చేయొద్దు

తానూరు: మీ సేవా, ఆధార్ కేంద్రాలకు వచ్చే వారి వద్ద అధిక చార్జీలు వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని ఈ మేనేజర్ నదీమ్ హెచ్చరించారు. బుధవారం మండలంలోని బెల్‌తరోడాలోని మీసేవా, తానూరులోని ఆధార్ కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ.. ప్రభుత్వం నిర్ణయించిన ధరకే లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలు అందించాలని ఆదేశించారు. ఆధార్, మీసేవా కేంద్రాల్లో అధిక చార్జీలు వసూలు చేస్తే టోల్ ఫ్రీ 1100 నంబర్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు.



మీసేవా కేంద్రాన్ని తనిఖీ చేస్తున్న నదీమ్

అమలులో 'స్థానిక' ఎన్నికల కోడ్

- ఉల్లంఘిస్తే చర్యలు తప్పవన్న అధికారులు
- జిల్లాలో నిలిచిన కొత్త పనులు



నిర్మల్‌చైన్‌గేట్: స్థానిక సంస్థల ఎన్నికలు సక్రమంగా నిర్వహించేందుకు అధికారులు సిద్ధమవుతున్నారు. రాష్ట్ర ఎన్నికల సంఘం ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్, వార్డు స్థానాల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటించగా సోమవారం నుంచి జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి అమలులోకి వచ్చినట్లు కలెక్టర్ అభిలాష అభినవ్ తెలిపారు. మంగళవారం 'స్థానిక' ఎన్నికల నిర్వహణపై మీడియాతో మాట్లాడారు.

జిల్లాలో 4,49,302 మంది ఓటర్లు

జిల్లాలో 4,49,302 మంది ఓటర్లుండగా, ఇందులో 2,13,805 మంది పురుషులు, 2,35,485 మంది మహిళలున్నారు. జిల్లాలో గ్రామపంచాయతీ ఎన్నికలకు 3,368 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు. 482 పోలింగ్ లొకేషన్లున్నాయి. ఎన్నికల నిర్వహణకు బ్యాలెట్ బాక్స్‌లు, పోలింగ్ సిబ్బంది, స్టేజ్-1, స్టేజ్-2 అధికారులకు శిక్షణ కార్యక్రమాలు కొనసాగిస్తున్నారు. ఆర్వో, పీవో శిక్షణ కార్యక్రమాలు మండలాలవారీగా చేపట్టారు. బ్యాలెట్లు ప్రచురించే విషయంలో ప్రింటింగ్ ప్రెస్‌లు పూర్తి వివరాలు ప్రదర్శించారని అధికారులు తెలిపారు.

కొత్త పనులకు బ్రేక్

స్థానిక సంస్థల ఎన్నికలకు షెడ్యూల్ ప్రకటనతో జిల్లాలో కొత్త పనులు అమలు నిలిపివేస్తున్నట్లు అధికారులు తెలిపారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వపరంగా ఎలాంటి శంకుస్థాపనలు, ప్రారంభోత్సవాలు నిర్వహించడానికి వీలులేదని తేల్చి చెప్పారు. ఇప్పటికే అమలులో ఉన్న పాత పథకాలు, పనులు మాత్రం యథావిధిగా కొనసాగుతాయని వివరించారు. రూ.50 వేలకు మించి తీసుకెళ్తే తప్పనిసరిగా సంబంధిత పత్రాలు చూపాలని సూచించారు. జిల్లాలో ఎన్నికల కోడ్ నేపథ్యంలో రాజకీయ పార్టీలు నిర్వహించే ఏ సమావేశం, ర్యాలీకైనా ఎన్నికల సంఘం అనుమతి తప్పనిసరిగా తీసుకోవాలని, మీడియాలో వచ్చే పెయిడ్ ఆర్టికల్స్‌పై ఎప్పటికప్పుడు పర్యవేక్షణ ఉంటుందని తెలిపారు.

గ్రామదేవతలకు బోనాలు

కుభీర్: మండల కేంద్రంతోపాటు మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం గ్రామదేవతలైన పోచమ్మ, మైసమ్మ గజ్జలమ్మకు బోనాలను నైవేద్యంగా సమర్పించారు. ఏటా దసరాకు ఒకరోజు ముందు బోనాలు సమర్పించడం ఆనవాయితీ అని భక్తులు తెలిపారు. గత ఆదివారం చల్లటి బోనాలను అమ్మవార్లకు నైవేద్యంగా సమర్పించినట్లు పేర్కొన్నారు.

'కడెం' గేటు ఎత్తివేత

కడెం: కడెం ప్రాజెక్టుకు బుధవారం రాత్రి 2,390 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో రావడంతో ఇరిగేషన్ అధికారులు ఒక వరద గేటు ఎత్తి 4,166 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు. ప్రాజెక్ట్ పూర్తి స్థాయి నీటిమట్టం 700 అడుగులు కాగా, ప్రస్తుతం 699.150 అడుగుల నీటి మట్టం ఉంది.

కవ్వాల్ అందాలు చూసొద్దాం!

- జన్నారం అటవీ డివిజన్‌లో ప్రారంభమైన సఫారీ
- వర్షాలు తగ్గడంతో అటవీశాఖ అనుమతి
- రోజుకు మూడుసార్లు.. రెండు గంటలు ప్రయాణం
- స్వల్పంగా పెరిగిన ధరలు


సఫారీలో అడవికి బయలుదేరుతున్న పర్యాటకులు

జన్నారం: పచ్చని చెట్లు, దట్టమైన అడవులు, చెంగు చెంగున ఎగురుతూ పరిగెత్తే వన్యప్రాణులు, స్వచ్ఛమైన ప్రాణవాయువు.. వీటికి చిరునామా కవ్వాల్ అడవులు. కవ్వాల్ టైగర్‌జోన్‌లోని జన్నారం అటవీ డివిజన్‌లో సఫారీ ప్రయాణంతో పర్యాటకులు నేరుగా అటవీ అందాలను, వన్యప్రాణులను చూసి ఆహ్లాదం పొందుతున్నారు. అటవీశాఖ ప్రతీ సంవత్సరం జూలై నుంచి సెప్టెంబర్ 30 వరకు సఫారీ ప్రయాణానికి అనుమతి నిలిపివేస్తుంది. తిరిగి అక్టోబర్ 1 నుంచి సఫారీ ప్రారంభమవుతుంది. ఈ ఏడాది గత వారం రోజుల వరకు వర్షాలు ఎక్కువగా కురువడంతో సఫారీకి మరికొంత సమయం పడుతుందని అంతా భావించారు. కానీ మూడు రోజులుగా వర్షాలు పడకపోవడంతో బుధవారం నుంచి సఫారీ ప్రయాణానికి అటవీశాఖ అధికారులు అనుమతినిచ్చారు.

అడవిలో రెండు గంటలు..

జన్నారం అటవీ రేంజ్‌లోని పలు ప్రాంతాలలో సఫారీ ప్రయాణానికి అనుమతి ఉంది. ఈ సఫారీ ప్రయాణం రెండు గంటలు ఉంటుంది. ఉదయం 6.30 గంటల నుంచి 8.30 గంటల వరకు, ఉదయం 9.30 గంటల నుంచి 11.30 గంటల వరకు, మధ్యాహ్నం 3.30 గంటల నుంచి 5.30 గంటల వరకు మూడుసార్లు సఫారీ ప్రయాణం ఉంటుంది. ఈ రెండు గంటలు గేట్ నంబర్ 1 నుంచి గొండుగూడ బేస్ క్యాంపు, బైసన్‌కుంట, మైసమ్మ కుంట ప్రాంతాల వరకు తీసుకెళ్తారు. బైసన్‌కుంటలో సేద తీరడానికి, టిఫిన్ చేయడానికి సౌకర్యం కల్పించారు. ఈ ప్రాంతంలో వన్యప్రాణులు ఎక్కువగా కనిపిస్తాయి.

పెరిగిన సఫారీ ధరలు

పర్యాటకులను అడవుల్లోకి తీసుకెళ్లడానికి అటవీశాఖ అధికారులు ఐదు సఫారీలను, పర్యాటక శాఖ అధికారులు రెండు సఫారీలను ఏర్పాటు చేశారు. ఈసారి సఫారీ ధరలు గతం కంటే పెరిగాయి. సోమవారం నుంచి గురువారం వరకు ఆరుగురికి రూ. 3500, అదనపు వ్యక్తులకు ఒక్కొక్కరికి రూ. 500 చొప్పున చెల్లించాల్సి ఉంటుంది. వీకెండ్ రోజుల్లో (శుక్ర, శని, ఆదివారాల్లో) సఫారీ ఆరుగురికి రూ.4000, అదనపు సభ్యుడికి రూ. 500 చొప్పున చెల్లించాలి. కాగా ముందుగానే బుక్ చేసుకోవాల్సి ఉంటుంది.

తగ్గిన హరిత గదుల ధరలు

దూరప్రాంతాల నుంచి వచ్చే పర్యాటకులు బస చేయడానికి జన్నారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన హరిత రిసార్ట్ గదుల ధరలు తగ్గాయి. కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ తగ్గించడంతో ధరలు తగ్గాయి. గతంలో సోమవారం నుంచి గురువారం వరకు ఏసీ గదులు రూ.2016, నాన్ ఏసీ గదులు రూ.1232, డార్మెంటరీ గది రూ.2500లుగా ఉండేవి. వీకెండ్ (శుక్ర, శని, ఆదివారాల్లో) ఏసీ గది రూ.2240, నాన్ ఏసీ రూ.1344, డార్మెంటరీ రూ. 3000 ఉండేవి. జీఎస్టీ తగ్గడంతో ఈ సంవత్సరం ప్రస్తుతం సోమవారం నుంచి గురువారం వరకు నాన్ ఏసీ రూ.1155, ఏసీ రూ.1890, డార్మెంటరీ రూ.2500, వీకెండ్‌లో నాన్ ఏసీ రూ.1260, ఏసీ గదులు రూ. 2100, డార్మెంటరీ రూ.3000గా ఉన్నాయి. దూర ప్రాంతాల నుంచి వచ్చే వారు ముందుగా టీఎస్‌టీడీసీ అనే వెబ్‌సైట్ ద్వారా గదులను బుక్ చేసుకోవాల్సి ఉంటుందని అధికారులు పేర్కొంటున్నారు.

పర్యాటకుల తాకిడి



అటవీశాఖ సఫారీ ప్రయాణానికి అనుమతి ఇవ్వడంతో పర్యాటకుల తాకిడి పెరిగే అవకాశం ఉంది. ఇప్పటికే హరిత రిసార్ట్‌కు పర్యాటకులు పెరుగుతున్నా సఫారీ లేకపోవడంతో కొంత నిరుత్సాహంగా ఉన్నారు. ప్రస్తుతం సఫారీ మొదలైంది. దీంతో పర్యాటకులు మరింతగా పెరుగుతారు.

– వీరేందర్, హరిత మేనేజర్

ఉన్నతాధికారుల ఆదేశాలతో..



జన్నారం డివిజన్‌లో గత మూడు నెలలుగా వన్యప్రాణుల సంరక్షణ దృష్టిలో పెట్టుకుని సఫారీకి అనుమతి ఇవ్వలేదు. వర్షాలు తగ్గుముఖం పట్టి, సఫారీ తిరిగే అవకాశం ఉన్నందున ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు తిరిగి ప్రారంభించాం. పర్యాటకంగా ఈ ప్రాంతాన్ని మరింత అభివృద్ధి చేస్తాం.

– రామ్మోహన్, ఎఫ్‌డీవో, జన్నారం

ఘనంగా శరన్నవరాత్రి ఉత్సవాలు


బాసర ఆలయంలో నవ చండీహోమం నిర్వహిస్తున్న ఆలయ అర్చక బృందం

బాసర: బాసరలో శ్రీ దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు బుధవారం అంగరంగ వైభవంగా జరిగాయి. శ్రీ జ్ఞాన సరస్వతి అమ్మవారు పదో రోజు మహా సరస్వతి అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. అమ్మవారి దర్శనం కోసం భక్తులు క్యూలైన్‌లో బారులుతీరారు. తల్లిదండ్రులు తమ చిన్నారులకు అక్షరాభ్యాసం చేయించారు. మహిళలు కుంకుమార్చనలో పాల్గొన్నారు. బాసర సరస్వతి అమ్మవారి ఆలయంలో ఆలయ వైదిక బృందం నవ చండీ హోమం, పూర్ణహుతి విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. శ్రీ సరస్వతి, మహాలక్ష్మి, మహంకాళి అమ్మవార్లకు వేద మంత్రోచ్ఛరణలతో మధ్య వైదిక బృందం మహాభిషేకము, విశేష అలంకరణ పూజలు చేశారు. సాయంత్రం అర్చకులు చతుషష్టి పూజలు నిర్వహించారు.

నేటి పూజలు..

విజయదశమి గురువారం వేకువ జామున 4 గంటలకు అమ్మవార్లకు మహాభిషేకము, ప్రాతఃకాల చతుషష్టి, శమీపూజ, పురవీధుల్లో అమ్మవారి ఉత్సవ విగ్రహాలతో పల్లకి సేవ వంటి కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు ఆలయ స్థానాచార్యులు ప్రవీణ్ పాటక్ తెలిపారు.

జెడ్పీటీసీ గరిష్ట ఖర్చు రూ.4 లక్షలు



కైలాస్‌నగర్: స్థానిక రిజర్వేషన్లు ఖరారు కావడంతో పల్లె రాజకీయం ఒక్కసారిగా వేడెక్కింది. ఎంపీటీసీ, జెడ్పీటీసీ, సర్పంచ్ ఎన్నికల బరిలో నిలిచేందుకు ఆశావహులు సై అంటున్నారు. ఆ దిశగా తమ ప్రయత్నాలను ముమ్మరం చేశారు. గెలుపే లక్ష్యంగా లక్షలను గుమ్మరించేందుకు రెడీ అవుతున్నారు. అయితే సదరు అభ్యర్థుల ఎన్నికల వ్యయ పరిమితిని ఎన్నికల సంఘం స్పష్టం చేసింది. తెలంగాణ పంచాయతీ రాజ్ చట్టం- 2018లోని సెక్షన్ 237 ప్రకారం ఏ ఎన్నికలో ఎంత ఖర్చు చేయాలనే వివరాలు వెల్లడించింది. జిల్లా ప్రజాపరిషత్ సభ్యుడు (జెడ్పీటీసీ)గా పోటీచేసే వారు గరిష్ఠంగా రూ.4లక్షలు, మండల ప్రజా పరిషత్ (ఎంపీటీసీ) అభ్యర్థులు రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. అలాగే పంచాయతీ ఎన్నికల్లో సర్పంచ్‌గా పోటీ చేసే అభ్యర్థి చేసే గరిష్ఠ ఎన్నికల ఖర్చుల వివరాలను సైతం నిర్దేశించింది. 2011 జనాభా లెక్కల ప్రకారం 5వేలు లేదా అంతకంటే ఎక్కువ జనాభా కలిగి ఉన్న గ్రామ పంచాయతీ సర్పంచ్ అభ్యర్థులు రూ. 2.50 లక్షలు, 5వేల కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామాల్లో రూ.1.50 లక్షలు ఖర్చు చేయాల్సి ఉంటుంది. ఇక వార్డు మెంబర్లు 5వేలు లేదా అంత కంటే ఎక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీలలో రూ.50వేలు, అంత కంటే తక్కువ జనాభా ఉన్న గ్రామ పంచాయతీల్లో రూ.30వేలను ఈసీ నిబంధనలకు అనుగుణంగా ఖర్చు చేయాల్సి ఉంటుంది.

క్లుప్తంగా

మద్యానికి బానిసై ఆత్మహత్య

భైంసాటౌన్: పట్టణంలోని బైల్‌బజార్ ప్రాంతానికి చెందిన తిరుపులే రాంచందర్(33) అనే వ్యక్తి ఇంట్లో ఉరేసుకొని ఆత్మహత్యకు పాల్పడిన ఘటన చోటుచేసుకుంది. పట్టణ ఎస్సై నాగభూషణం కథనం ప్రకారం.. రాంచందర్ స్థానికంగా పెయింటర్‌గా పనిచేస్తున్నాడు. మద్యానికి బానిసగా మారి తరచూ భార్యను వేధిస్తుండడంతో ఆమె ఇటీవల పుట్టింటికి వెళ్లిపోయింది. దీంతో మనస్తాపం చెందిన రాంచందర్ మంగళవారం రాత్రి ఇంట్లో ఎవరూ లేని సమయంలో ఉరేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని ఏరియాస్పత్రికి తరలించారు. మృతుడి భార్య గంగాసాగర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. అయితే రాంచందర్ పెయింటింగ్ పని లేకపోవడంతో ఆర్థిక సమస్యలతో ఆత్మహత్య చేసుకున్నట్లు భైంసా పెయింటర్స్ అసోసియేషన్ సభ్యులు పేర్కొంటున్నారు. ఇతర రాష్ట్రాల నుంచి వచ్చిన వలస కార్మికుల కారణంగా స్థానికులకు ఉపాధి లేకుండా పోయిందని, ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడు మృతి


చందు(ఫైల్)

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ సమీపంలో మూలమలుపు వద్ద బుధవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందారు. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ధర్మాజీపేట్ గ్రామానికి చెందిన రొడ్డ చందు(35) కడెం వైపు నుంచి ధర్మాజీపేట్‌కు బైక్‌పై వెళ్తున్నాడు. ధర్మాజీపేట్ సమీపంలోని మూలమలుపు వద్ద ఎదురుగా వస్తున్న టాటాఏస్ వాహనం ఢీకొట్టింది. తలకు తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతిచెందాడు. సంఘటన స్థలాన్ని ఎస్సై సాయికిరణ్ పరిశీలించారు. కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పేర్కొన్నారు.

దుబాయ్‌లో భైంసా వాసి మృతి


తుమ్మల శ్రీనివాస్ (ఫైల్)

భైంసాటౌన్: ఉపాధి నిమిత్తం దుబాయ్ వెళ్లిన భైంసా వాసి అక్కడ గుర్తు తెలియని వాహనం ఢీకొని మృతి చెందాడు. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. పట్టణంలోని సంతోష్‌మాత నగర్‌కు చెందిన తుమ్మల శ్రీనివాస్(35) నెల క్రితం దుబాయ్‌కు వెళ్లాడు. అక్కడకు వెళ్లిన కొద్దిరోజులకే మతిస్థిమితం కోల్పోయి రోడ్లపై తిరిగాడు. ఈ క్రమంలో గుర్తు తెలియని వాహనం ఢీ కొనడంతో తీవ్రంగా గాయాలపాలై చికిత్స పొందుతూ మృతి చెందాడు. కాగా మృతదేహాన్ని స్వస్థలానికి రప్పించాలని ఎన్ఆర్ఐ అడ్వైజరీ కమిటీని కుటుంబ సభ్యులు సంప్రదించారు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.

పొన్నారిలో శతాధిక వృద్ధురాలు మృతి

తాంసి: మండలంలోని పొన్నారి గ్రామానికి చెందిన శతాధిక వృద్ధురాలు ముచ్చ ఎల్లక్క(102) అనారోగ్యంతో బుధవారం మృతి చెందింది. గత కొంత కాలంగా వయోభారంతో బాధపడుతున్న ఎల్లక్క ఇంటి వద్ద మృతిచెందింది. గ్రామంలోనే అత్యధిక వయస్కురాలిగా ఉన్న ఎల్లక్క ఆహార అలవాట్లతో ఆరోగ్యంగా ఉండేదని గ్రామస్తులు తెలిపారు. గ్రామస్తులు ఆమె మృతి పట్ల సంతాపం వ్యక్తం చేశారు.

బెల్ట్‌షాపుపై దాడి.. మద్యం స్వాధీనం

ఇచ్చోడ: మండల కేంద్రంలోని రవీంద్రనగర్ కాలనీలో నరాల రాజేశ్వర్ నిర్వహిస్తున్న బెల్ట్‌షాపుపై బుధవారం సీసీఎస్ సీఐ చంద్రశేఖర్ ఆధ్వర్యంలో ఆకస్మికంగా దాడులు నిర్వహించారు. అక్రమంగా దాచి ఉంచిన రూ.38 వేల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. అనంతరం స్థానిక తహసీల్దార్ జాదవ్ రమేశ్ ఎదుట బైండోవర్ చేశారు. స్వాధీనం చేసుకున్న మద్యాన్ని ఇచ్చోడ పోలీస్‌స్టేషన్‌లో అప్పగించారు. ఈ మేరకు ఎస్సై పురుషోత్తం కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు.

కల్తీ మద్యం జోరు..!

మంచిర్యాలకు చెందిన రాకేశ్(పేరు మార్చాం) జిల్లా కేంద్రంలోని ఒక వైన్ షాపులో బ్లెండర్స్ ప్రైడ్ ఫుల్ బాటిల్ కొనుగోలు చేశాడు. అతను రెగ్యులర్‌గా ఈ బ్రాండ్ తాగడంతో సీల్ అలాగే ఉన్నప్పటికీ కల్తీని సులభంగా గుర్తించాడు. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదు చేశాడు.

మంచిర్యాల కాలేజ్ రోడ్‌కు చెందిన మురళీకృష్ణ (పేరు మార్చాం) తన బర్త్‌డే సందర్భంగా రెండు రోజుల క్రితం జిల్లా కేంద్రంలోని మద్యం దుకాణంలో రెండు రాయల్ స్టాగ్ ఫుల్ బాటిల్స్ కొనుగోలు చేశాడు. నలుగురు స్నేహితులు కలిసి రెండు బాటిల్స్ తాగినా కిక్కు ఎక్కకపోవడంతో కల్తీ జరిగిందని గుర్తించారు.

- చౌక మద్యంలో మంచినీళ్లు, స్పిరిట్
- ఖరీదైన మద్యంలో చీప్ లిక్కర్, గుడుంబా
- పండుగవేళ పెద్ద ఎత్తున డంప్
- స్థానిక సంస్థల ఎన్నికల కోసమూ..
- 'మామూలు'గా తీసుకుంటున్న అబ్కారీ శాఖ

మంచిర్యాలక్రైం: ఒకవైపు దసరా పండుగ.. ఇంకోవైపు స్థానిక సంస్థల ఎన్నికల సందడి.. ఇదే అదనుగా జిల్లాలో కల్తీ మద్యం దందా జోరందుకుంది. విక్రయాలు జోరుగా సాగుతున్నాయి. నవంబర్ 30తో ప్రస్తుత మద్యం షాపుల లైసెన్స్ గడువు ముగుస్తుంది. డిసెంబర్ 1 నుంచి కొత్త మద్యం పాలసీ అమలులోకి వస్తుంది. దీంతో మద్యం షాపుల యజమానులు జీరో దందాకు తెరలేపారు. ఈసారి దసరా గాంధీ జయంతి ఒకే రోజు వస్తున్నాయి. మద్యం, మాసం దుకాణాలు మూసివేస్తారు. ఈనేపథ్యంలో ముందస్తు మద్యం అమ్మకాలు జోరుగా సాగుతున్నాయి. కొనుగోలుదారులకు వ్యాపారులు కల్తీ మద్యం అంటగడుతున్నారు. ఎక్సైజ్ శాఖ అధికారులు మద్యం అమ్మకాలు పెంచాలని ఒత్తిడి తెస్తున్నారు. ఇది కూడా కల్తీ దందాకు కలిసి వస్తోంది. స్పిరిట్ కలిపిన చౌక మద్యాన్ని గ్రామాలు, బెల్ట్ షాపులకు విక్రయిస్తున్నారు. పట్టణాల్లో వైన్ షాపుల యజమానులు మద్యం స్టాక్ తెప్పించుకుని స్వేచ్ఛగా కల్తీ చేసి విక్రయిస్తున్నారు.

కల్తీ ఇలా..

కల్తీ మద్యం అసలు స్వరూపాన్ని మరిపించేలా ఉంటుంది. బార్లలోనూ ఇదే పరిస్థితి. ఇతర రాష్ట్రాల నుంచి రెక్టిఫైడ్ స్పిరిట్‌ను తెచ్చి వైన్ షాపుల్లోనే కల్తీ చేస్తున్నారు. ఖరీదైన మద్యంలో చౌక మద్యం, చౌక మద్యంలో స్పిరిట్, నీళ్లు కలుపుతున్నారు. బ్రాండ్ ఏదైనా, బాటిల్‌పై ఏ పేరు ఉన్నా, లోపలి మందు ఏమిటో చెప్పడం కష్టం. బాటిల్ సీల్ అలాగే ఉంటుంది. లోపలి మద్యం మాత్రం కల్తీ అవుతోంది. అధిక అమ్మకాలున్న బ్రాండ్‌లనే ఎక్కువగా కల్తీ చేస్తున్నారు. ధనార్జనే ధ్యేయంగా వ్యాపారులు మందుబాబుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు. వైన్ షాపుల్లో కల్తీ విక్రయాలు జరుగుతుంటే, బెల్ట్ షాపుల్లో గుడుంబా కల్లు తయారీ అమ్మకాలు కూడా జరుగుతున్నట్లు సమాచారం. లైసెన్స్‌డ్ వ్యాపారులే రహస్యంగా కల్తీ చేస్తున్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఎక్సైజ్ అధికారులకు ఫిర్యాదులు చేసినా పట్టించుకోకపోవడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. జిల్లాలోని కోల్‌బెల్ట్ ప్రాంతాలైన శ్రీరాంపూర్, బెల్లంపల్లి, ఇందారం, హాజీపూర్, మంచిర్యాల జిల్లా కేంద్రం వంటి ప్రాంతాలు కల్తీ మద్యం కేంద్రాలుగా మారాయని సమాచారం.

కిక్కు తక్కువ..

ప్రధానంగా మద్యం దుకాణాల్లో ప్రీమియం బ్రాండ్‌లు కొనుగోలు చేసిన వారు కిక్కు ఎక్కడం లేదని పేర్కొంటున్నారు. దీనికి కల్తీ మద్యమే కారణమని ఒక ఎక్సైజ్ ఉన్నతాధికారి తెలిపారు. బార్లలో మొదటి పెగ్ అసలు మద్యం సర్వ్ చేసి, తర్వాత కల్తీ మద్యం ఇస్తున్నారనే ఫిర్యాదులు ఉన్నాయి. వ్యాపారులు లాభాల కోసం ప్రజల ఆరోగ్యాన్ని పణంగా పెడుతున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి.

కల్తీ చేస్తే కఠిన చర్యలు..



మద్యం కల్తీ చేస్తే కఠిన చర్యలు తీసుకుంటాం. ఎమ్మార్పీ కన్నా ఎక్కువ ధరలకు విక్రయించినా చర్యలు తీసుకుంటాం. ఎక్కడైనా కల్తీ జరిగినట్లు తెలిస్తే నేరుగా ఫిర్యాదు చేయండి. గుడుండా విక్రయాలపై ప్రభుత్వం సీరియస్‌గా ఉంది. గుడుంబా విక్రయాలపై సమాచారం అందించండి. సమాచారం ఇచ్చిన వారిపేర్లు గోప్యంగా ఉంచుతాం.

– కేజీ.నందగోపాల్, జిల్లా ఎక్సైజ్ శాఖ అధికారి

కడెం ప్రధాన కాలువలో ఒకరి గల్లంతు


సురేందర్


సంఘటన స్థలాన్ని పరిశీలిస్తున్న అధికారులు

దస్తురాబాద్: కడెం ఎడమ కాలువలో ప్రమాదవశాత్తు ఒకరు గల్లంతైన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. ఎస్సై సాయికుమార్ తెలిపిన వివరాల ప్రకారం మండలంలోని రేవోజీపేట గ్రామానికి చెందిన మైదం సురేందర్ అనే వ్యక్తి ఉదయం 10 గంటలకు కడెం ఎడమ కాలువలో స్నానం చేయడానికి వెళ్లి ప్రమాదవశాత్తు వరద ప్రవాహంలో కొట్టుకుపోయాడు. అక్కడే ఉన్న స్థానికులు కాపాడే ప్రయత్నం చేసినా వరద ఉధృతికి మునిగిపోవడంతో అతని ఆచూకీ లభించలేదు. సంఘటన స్థలాన్ని తహసీల్దార్ విశ్వంబర్ పరిశీలించారు. భార్య కళావతి ఫిర్యాదు మేరకు మిస్సింగ్ కేసు నమోదు చేసి గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై తెలిపారు.

తవ్వకాల్లో దొరికిన వినాయక విగ్రహానికి పూజలు


పూజలు చేస్తున్న కాలనీవాసులు

ఆదిలాబాద్: జిల్లా కేంద్రంలోని న్యూహౌజింగ్ బోర్డు కాలనీలో ఏర్పాటు చేసిన శారద దేవి మండపం వద్ద ప్లాంటేషన్ సందర్భంగా జరిపిన తవ్వకాల్లో వినాయక విగ్రహం బయల్పడింది. ఈ సందర్భంగా బుధవారం కాలనీవాసులు పెద్ద ఎత్తున తరలివచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు క్షీరాభిషేకంతో పాటు పంచామృతాభిషేకం జరిపారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ సీవీఎన్ రాజు, కాలనీవాసులు పాల్గొన్నారు.

హత్యాయత్నానికి పాల్పడ్డ వ్యక్తి అరెస్ట్

జన్నారం: హత్యాయత్నానికి పాల్పడిన వ్యక్తిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపిన ఘటన మండలంలో చోటు చేసుకుంది. బుధవారం ఎస్సై గొల్లపెల్లి అనూష తెలిపిన వివరాల ప్రకారం.. జన్నారం మండలం తిమ్మాపూర్ గ్రామానికి చెందిన దర్శనాల నరేశ్ మంగళవారం రాత్రి బతుకమ్మ వద్ద గల లైట్లను పగులకొట్టగా తిమ్మాపూర్ గ్రామానికి చెందిన బోర్లకుంట శంకరయ్యకు, నరేశ్‌కు మధ్య గొడవ జరిగింది. ఈ క్రమంలో నరేశ్ శంకరయ్యను కత్తితో పొడిచాడు. శంకరయ్య తీవ్రగాయాలతో కేకలు వేయగా నరేశ్ అక్కడి నుంచి పారిపోయాడు. వెంటనే స్థానికులు శంకరయ్యను 108లో ఆసుపత్రికి తరలించారు. బుధవారం శంకరయ్య ఫిర్యాదు మేరకు నరేశ్‌పై కేసు నమోదు చేసుకొని రిమాండ్‌కు తరలించినట్లు ఎస్సై తెలిపారు.